క్లుప్తంగా

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న సుశీల్ సుబ్రమణ్యం

నగరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కాకవేడులో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రజాసేవలో ఇటీవల డాక్టరేట్ అందుకున్న సుశీల్ సుబ్రమణ్యం ఈ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులకు పోటీకి అవసరమైన సామగ్రి, షీల్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి అందరికీ పండుగ దినమన్నారు. క్రీడా స్ఫూర్తి అలవడాలన్న ఉద్దేశంతో తన తండ్రి జ్ఞాపకార్థం ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు.


కొళాయిల్లో రంగు నీరు



బిందెలో పట్టి ఉంచిన రంగునీరు

నగరి: కీళపట్టు పెరుమాళ్‌నగర్‌లో కొళాయిలో రంగునీరు రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. బోరులోని నీరు తాగడానికి అనువైంది కాకపోవడంతో స్థానికులు మున్సిపాలిటీవారు పంపిణీ చేసే నీటిపైనే ఆధారపడతారు. ఆ నీరు కూడా రంగుగా రావడంతో జనం విస్తుపోయారు. ఇలా వచ్చేనీరు తాము ఎలా వాడుకోవాలంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు వాటర్ ప్లాంట్ నుంచి నీరు తెచ్చుకోలేకే మున్సిపల్ నీరు వాడుకుంటున్నామని ఇలా రంగుగా వచ్చే నీరు ఏలా వాడాలంటూ ప్రశ్నించారు. శుభ్రమైన నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థి



నికిత్

గంగాధరనెల్లూరు: ఇంటర్ ఫలితాల్లో మండలంలోని గారంపల్లికి చెందిన శ్యామల భాస్కర్ నాయుడి కుమారుడు నికిత్ సత్తా చాటారు. తిరుపతిలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్ విద్యను అభ్యసించిన నికిత్ ఎంపీసీలో 1000కి గాను 989 మార్కులు సాధించి సత్తా చాటారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన నికిత్ మంచి మార్కులు సాధించడంతో స్థానికులు అభినందించారు.

ముత్తుకూరులో కార్డన్ సెర్చ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామంలో ఆదివారం బీఎన్ ఆర్‌పేట పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో లక్ష్మీపతి అనే వ్యక్తి ఇంట్లో మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కచ్చితంగా అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు ఉంటాయని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.


16 నుంచి పానాటూరులో మహాభారత యజ్ఞం



ముస్తాబవుతున్న ఆలయం

గుడిపాల: మండలంలో పానాటూరు గ్రామంలో ఈ నెల 16వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు భాగవతారిణి హేమలతచే హరికథా కలాక్షేపం ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి 10 రోజుల పాటు పాండురంగ నాటక మండలిచే వీధినాటకం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు 14న ఉదయం గ్రామంలో అమ్మవారికి అభిషేకం, 15న అంబలిపోయుట, 16న ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, 24వ తేదీ సాయంత్రం బలిబండి కార్యక్రమం, 27వ తేదీన 10 గంటలకు అమ్మవారి కల్యాణం, మే 4న ఉదయం 10గంటలకు దుర్యోధన వధ, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశ పట్టాభిషేకం, మే 5న సాయంత్రం 4గంటలకు వసంతోత్సవం, పొంగళ్లు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



బైక్‌ను ఢీకొన్న కారు

గంగాధర నెల్లూరు: కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. అగర మంగళం గ్రామానికి చెందిన సీతారాం కుమారుడు ప్రకాష్ తన ద్విచక్ర వాహనంపై పెట్రోల్ బంకుకు వెళుతుండగా తడకు గ్రామానికి చెందిన గుణశేఖర్ కారులో పుత్తూరు వైపునుంచి చిత్తూరుకు వెళుతూ ప్రకాష్‌ను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌ను వేలూరుకు తరలించారు. జీడీ నెల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల లేమి

ప్రభుత్వం మారడంతో ఆర్టీసీ సేవల రూటు మారింది. బస్సుల సంఖ్యను పెంచడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడంలో పుత్తూరు ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారు. పుత్తూరు బస్టాండ్‌లోకి అడుగుపెట్టే ప్రయాణికుల అవస్థలు చెప్పనలవి కాదు. దీంతో ప్రయాణికులు దుమ్మెత్తిపోస్తున్నారు. కనీస సౌకర్యాలు లేవంటూ ఛీదరించుకొంటున్నారు. ఇదీ ఒక బస్టాండేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

–పుత్తూరు

మరుగుదొడ్లకు తాళాలు, నిరుపయోగంగా హ్యాండ్ వాష్





- పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల తిష్ట
- తాగునీరు ఊసే లేదు
- మరుగుదొడ్లు బంద్
- అద్దె గదులు, పార్కింగ్ పేరిట ఆదాయం ఫుల్
- ప్రయాణికులకు సౌకర్యాలు కరువు



ప్రయాణ బడలికతో బస్టాండ్‌లో అడుగుపెట్టే ప్రయాణికులు ముందుగా టాయిలెట్స్ కోసం వెతుకుతారు. ప్రస్తుతం బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు తాళం వేశారు. అలాగే బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం అంటూ ప్రత్యేకంగా తాగునీటి వసతి లేకపోవడం ఇక్కడ పెద్ద లోటు. ఉన్న ఒకే ఒక్క హ్యాండ్ వాష్‌లో సైతం ప్రస్తుతం నీరు రావడం లేదు. బస్టాండ్‌లో ఏదైనా తినాలంటే క్యాంటీన్ కనబడదు. గత కొన్నేళ్లుగా ఇక్కడి క్యాంటీన్‌ను మూసివేశారు.

బస్సుల సంఖ్య కుదింపు

గతంలో ప్రయాణికులకు సేవలందించడంలో పుత్తూరు డిపో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండేది. ప్రస్తుతం తిరోగమనంలో పయనిస్తోంది. తిరుపతి రీజనల్ కార్యాలయం ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గతంలో 130 బస్సులతో పరుగులు పెడుతున్న పుత్తూరు ఆర్టీసీ డిపో ప్రస్తుతం కేవలం 75 బస్సులకే పరిమితమైంది. అద్దె బస్సులను సైతం 14 నుంచి 11కు కుదించారు. పుత్తూరు నుంచి తిరుపతి, తిరుమల, చిత్తూరు, తిరుత్తణి, కంచి, తిరువళ్లూరు పట్టణాలతోపాటు పలు గ్రామాలకు సర్వీసులు నడుస్తుంటాయి. విద్యా కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న పుత్తూరుకు విద్యార్థుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పుత్తూరు డిపో పరిధిలో సుమారు 25 వేల మంది ప్రయాణికులు అనునిత్యం ఆర్టీసీపై ఆధారపడి తమ గమ్యస్థానాలకు చేరుతుంటారు. అయితే ఇటీవల కాలంలో 55 బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు, ప్రైవేటు బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది.

రద్దు చేసిన సర్వీసులు

పుత్తూరు నుంచి హైదరాబాద్‌కు ఉన్న సూపర్ లగ్జరీ సర్వీసును సత్యవేడుకు తరలించారు. నగరి నుంచి నెల్లూరుకు వెళ్లే సర్వీసును రద్దు చేశారు. పుత్తూరు నుంచి నగరి మీదుగా చిత్తూరుకు వెళ్లే సర్వీసును రద్దు చేశారు. పుత్తూరు నుంచి బాదూరు మీదుగా తిరుపతికి వెళ్లే రెండు సర్వీసుల్లో ఒకటి, అప్లాయిగుంట మీదుగా తిరుపతికి వెళ్లే రెండు సర్వీసులను రద్దు చేశారు. పుత్తూరు నుంచి చవటగుంట మీదుగా పెనుమూరుకు గతంలో నాలుగు సర్వీసులు ఉండగా ఒక్కదానికే పరిమితం చేశారు. ఇలా పలు బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

మరుగుదొడ్ల సమస్య



బాత్‌రూమ్ వెళ్లాలంటే తాళాలు వేసి ఉన్నారు. ఎవరిని ఏమని అడగాలి.. కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేవు. అసలే ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులకు లేదా?

– వాణి, ప్రయాణికురాలు, డీఎంపురం

తాగునీరు ఏర్పాటు చేయాలి



ఎండన పడి వచ్చాం. బస్టాండ్‌లో ఎక్కడా నీటి చుక్క లేదు. ప్రయాణికుల పరిస్థితిని ఇక్కడి అధికారులు పట్టించుకొనే పాపాన పోయేట్టు లేదు. బస్టాండ్‌లో నీళ్ల బాటిల్ కొని తాగే పరిస్థితి మాకు లేదు. బస్టాండ్‌లో తాగునీరు ఏర్పాటు చేయాలి.

– మాతమ్మ, ప్రయాణికురాలు, కార్వేటినగరం

బస్టాండ్ అధ్వానంగా ఉంది



టాయిలెట్స్ లేవు, తాగేందుకు, చేతులు కడిగేందుకు నీళ్లు లేవు. దీనిని బస్టాండ్ అంటారా? ఇలాంటి బస్టాండ్‌ను నేను ఎక్కడా చూడలేదు. బస్టాండ్ అధ్వానంగా ఉంది. ఎండాకాలంలో తాగేందుకు నీళ్లు ఏర్పాటు చేయాలి.

– కె.గుణశేఖర్, ప్రయాణికుడు, రామగిరి, పిచ్చాటూరు మండలం

సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం



బోరు పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో మరుగుదొడ్లుతో పాటు హ్యాండ్ వాష్‌కు నీటి సరఫరా ఆగిపోయింది. ఈ సమస్య పార్కింగ్ కాంట్రాక్టర్ కారణంగా ఏర్పడింది. మరమ్మతులు చేపట్టాం. త్వరితగతిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. బస్సుల సంఖ్యను పెంచుతాం.

–ఎం.ఎస్.ప్రశాంతి, డిపో మేనేజర్, పుత్తూరు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులను సత్కరిస్తున్న కుమార్‌రెడ్డి

పుత్తూరు: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకనుగుణంగా నిరంతర కృషి చేయాలని భగత్ సింగ్ అధ్యయన కేంద్రం తిరుపతి జిల్లా కన్వీనర్ కె.కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం పుత్తూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఇంటర్ ఫస్టియర్‌లో సత్తా చాటిన విద్యార్థులు పి.ముఖేష్, పార్థసారధి, చిరంజీవి, యశ్వంత్‌లను ఆయన సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యాంశాలను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. భగత్‌సింగ్ అధ్యయన కేంద్రం సభ్యులు జబ్బార్, శరవణ, మురగారెడ్డి, రామ్‌రాజ్, పడయప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



రోడ్డు భద్రతా నియమాల ఫ్లెక్సీ వద్ద డీఎస్పీ, సీఐ విక్రమ్

నగరి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. రోడ్డు భద్రత నిమిత్తం ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటుచేయడానికి సీఐ విక్రమ్ సిద్ధం చేసిన ఫ్లెక్సీలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, సెల్ ఫోన్ డ్రైవింగ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనదారులకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేకంగా కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కీళపట్టు, తెరణి క్రాస్ వద్ద బారికేడ్లను అమర్చామన్నారు. వాహనదారులు భద్రత నియమాలను పాటించి ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకొని పోలీస్ వారికి సహకరించాలన్నారు.



గురువులతో కలసి పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం వారు చదివినవారు అదే పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు 38 ఏళ్ల తరువాత ప్రభుత్వం, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన స్నేహితులు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విద్య నేర్పించిన గురువులు మార్కొండ నాయుడు, పాద పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాలకు రూ.15 విలువచేసే వాటర్ ఫిల్టర్ అందించారు. విరమణ పొందిన ఉపాధ్యాయులు మార్కొండ నాయుడు, రామస్వామిరాజు, దొరస్వామి, పాఠశాల స్థలదాత మునిరత్నం నాయుడు, ప్రస్తుత ఉపాధ్యాయులు రమేష్, ఏలుమలై తదితర ఉపాధ్యాయులను సన్మానించారు.



రిటైర్డ్ టీచర్ మురళిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

పుత్తూరు: పాతికేళ్ల క్రితం కలిసి చదువుకొన్న విద్యార్థులు అందరూ మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాలు పూర్వ విద్యార్థుల సందడితో కళకళలాడింది. 2000–01 విద్యా సంవత్సరంలో చదువుకొన్న పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత క్రాఫ్ట్ టీచర్ వి.కె.మురళి స్వయంగా తయారు చేసిన టీపాయ్‌ని విద్యార్థులకు బహూకరించారు. ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు వి.కె. మురళి, సూర్యప్రకాష్, బాబు, ఆదిమూలంను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ టీచర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. సుందరరాజపురంలోని విజయం విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతామన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ సంఘానికి అధికారిక గుర్తింపు మంజూరు చేసేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌ను అభివృద్ధి చేస్తే టీచర్ల ఉద్యోగోన్నతులు సాధ్యమని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలు జాగ్రత్త



ఎస్ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం: వేసవి సెలవుల్లో ఇంటికొచ్చిన పిల్లలు, ప్రస్తుత వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఆయన ఆదివారం కొన్ని గ్రామాల్లో పర్యటించారు. వేసవి సెలవుల్లో వచ్చిన పిల్లలు చెరువులు, బావులు, కుంటల వద్ద ఈత కొడుతున్నట్లు ఆయన గమనించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవి సెలవుల్లో విద్యార్థులు వాహనాలను రోడ్డుపైకి తీసుకొచ్చి గానీ, చెరువు, బావులు, కుంటలు, ఊట బావుల వద్దకు, పాడుబడిన బావుల వద్దకు వెళ్లి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నారులను వారి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడూ గమనిస్తూ ఉండాలని సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్య అన్నదానానికి ఆదివారం ఓ దాత నగదు విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన శివకుమార్ రూ. లక్ష నగదును నిత్యాన్నదాన ట్రస్టుకు అందజేశారు. ఆలయ సిబ్బంది దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనుల పండువగా లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవం



ఉభయదారులకు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామికి కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి ఆలయ అర్చకులు విశేష సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛరణ మధ్య అభిషేకం చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత అయినా నారాయణుడికి వేదమంత్రాలు పట్టు వస్త్రాలు మేళతాళాల మధ్య అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు. మదనపల్లెకు చెందిన హరీష్, చిత్తూరుకు చెందిన నీలమ్మ, చంద్రాచారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపాన్ని భాగవతారిణి శారద, కీర్తనలు, భక్తిగీతాలను రెడ్డమ్మ ఆలపించి భక్తులను అలరించారు. అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి భక్తులు పాల్గొన్నారు.

కోదండరాముడి భిక్షాటన ఉత్సవం

సీతాదేవి అలక తీర్చే ఘట్టాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి భిక్షాటనలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరవీధుల్లో ఊరేగించారు. తర్వాత ఆలయ ఆవరణలో సీతాదేవి అలక తీర్చే ఉత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఈ కార్యక్రమం గంటన్నరపాటు సంప్రదాయబద్ధంగా కొనసాగింది. అనంతరం ఈ ఘట్టం విశేషాన్ని పండితులు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాల్, ఈవో సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

–కాణిపాకం



సీతాదేవి అలక తీర్చే ఉత్సవం

తాగునీటి సమస్యకు పరిష్కారం



నూతనంగా పైపులు దింపుతున్న సర్పంచ్

విజయపురం: పన్నూరు దళితవాడలో ఇక తాగునీటి సమస్య లేనట్టేనని సర్పంచ్ కుమార్ అన్నారు. పన్నూరు దళితవాడలో ఇటీవల నూతనంగా వేసిన రెండు బోర్లకు ఆదివారం చేతిపంపు అమర్చారు. స్థానికంగా విద్యుత్ మోటార్ ఉన్నా..విద్యుత్ లేని సమయంలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు రెండు చేతిపంపులు ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. రానున్న తరాలకు తాగునీటి సమస్య రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని ఆయన తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఈత మట్టలతో క్రైస్తవుల ర్యాలీ



ఈత మట్టలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మట్టలు చేతపట్టి ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

విజయపురం: మండలంలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. క్రైస్తవులు ఈత మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు వీధుల్లో ఈత మట్టలు, ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. విజయపురం, పన్నూరు, మహారాజపురం, మాధవరం, ఆలపాలం గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు చక్కని నాటికలతో, యవ్వనస్తులు ప్రత్యేక గీతాలతో అలరించారు. పాస్టర్లు, బ్రదర్లు మట్టల ఆదివారం విశిష్టతను తెలియజేశారు.

ఘనంగా మట్టల ఆదివారం

కార్వేటినగరం: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే మట్టల ఆదివారం పండుగను ఆదివారం బీసీ కాలనీలోని బేతేల్‌షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చిన్నారులు వివిధ రకాల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతపట్టి ప్రభువు కీర్తనలను ఆలపించారు. ప్రభువు కీర్తనలను ఆలపిస్తూ గ్రామ వీధుల్లో ఊరేగారు. అనంతరం చర్చికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పాస్టర్ ఆశీర్వాదం ప్రసంగిస్తూ మానవులకు ప్రభువు బోధించిన సందేశాలను వివరించారు. ఈ క్రమంలో భాగంగా చర్చి ఆవరణలో 500 మందికి అన్నదానం చేశారు. కార్వేటినగరంలోని యెహోవా ఈరే చర్చిలో కూడా పాస్టర్ అగస్టీన్ సరోజినీ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు బాబు, హరిబాబు, క్రైస్తవులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హోసన్న పండుగ

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో హోసన్న (మట్టల) పండుగ జరుపుకున్నారు. ఆముదాల సీఎస్ఐ చర్చిలో పాస్టర్ మెంకటేస్, ఉపదేశకులు విలీయం ఆధ్వర్యంలో హోసన్న పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు మట్టలు చేతపట్టి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేస్తూ ఊరేగింపు చేశారు.